

మసాజ్ సెంటర్‌లో పట్టుబడిన ఎస్‌ఐ

- విశాఖలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నాలుగు మసాజ్‌సెంటర్లపై కేసు నమోదు
- ఏడుగురు విటులు అరెస్టు
- 17 మంది యువతులు స్వధార్‌హోమ్‌కి అప్పగింత

విశాఖ నగర పోలీస్ కమిషనరేట్‌లోని కంట్రోల్‌రూమ్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ ఒకరు కంచరపాలెం స్టేషన్ పరిధిలోని ఒక మసాజ్ సెంటర్‌లో సోదాలు నిర్వహించేందుకు వెళ్లిన పోలీసులకు అభ్యంతరకరమైన రీతిలో పట్టుబడ్డారు.

-వివరాలు 7వ పేజీలో

కూటమి దూకుడు

అభ్యర్థుల ప్రకటనలో ముందున్న టీడీపీ, జనసేన

- జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలకూ ఖరారు
- నర్సీపట్నం, పాయకరావుపేట, అనకాపల్లికి గతంలోనే ఎంపిక
- తాజాగా మిగిలిన నాలుగింటికి అభ్యర్థులు ప్రకటన
- చోడవరం నుంచి కేఎస్ఎన్ఎస్ రాజు, మాడుగుల నుంచి పైలా ప్రసాదరావు
- పంచకర్లకు పెందుర్తి, విజయకుమార్‌కు ఎలమంచిలి..



అనకాపల్లి/చోడవరం/మాడుగుల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికలకు ఒకటి, రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు వుండడంతో అభ్యర్థుల ఎంపికను ప్రధాన రాజకీయ పార్టీలు వేగవంతం చేశాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించడంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఒకింత ముందున్నాయి. ఈ రెండు పార్టీలతోపాటు బీజేపీ కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. అనకాపల్లి లోక్‌సభ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను టీడీపీ నాలుగు, జనసేన మూడు స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయి. అనకాపల్లి పార్లమెంట్ స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. అసెంబ్లీ స్థానాల్లో టీడీపీకి కేటాయించిన నర్సీపట్నం నుంచి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట నుంచి వంగలపూడి అనిత, జనసేన పార్టీకి కేటాయించిన అనకాపల్లి నుంచి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పేర్లను గత నెల 24వ తేదీన ఇరుపార్టీ అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఉమ్మడిగా ప్రకటించిన విషయం తెలిసింది. మిగిలిన నాలుగు నియోజకవర్గాలకు పోటీ చేసే అభ్యర్థుల పేర్లను గురువారం ప్రకటించారు. తెలుగుదేశం పార్టీకి కేటాయించిన చోడవరం నుంచి మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, మాడుగుల నుంచి పైలా ప్రసాదరావు పోటీ చేస్తారని పార్టీ అధినేత చంద్రబాబు వెల్లడించారు. ఇక జనసేన పార్టీకి కేటాయించిన పెందుర్తి నుంచి మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, ఎలమంచిలి నుంచి సుందరపు విజయకుమార్ పేర్లను అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. దీంతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు కూటమి అభ్యర్థులు ఖరారయ్యారు. అయ్యన్న, అనిత, కొణతాల ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించగా, తాజాగా టికెట్లు ఖరారైన అభ్యర్థులు మంచి ముహూర్తం చేసుకుని ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారు. ఇక అనకాపల్లి లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయించడంతో అభ్యర్థి ఎంపికపై పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నది.

గాజువాకపై వీడిన ఉత్కంఠ

తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు ఖరారు

- మరోమారు పవన్‌కల్యాణ్ పోటీ చేస్తారని కొద్దికాలంగా ప్రచారం
- ఆయన కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి బరిలోకి దిగుతుండడంతో ఇక్కడ పల్లాకు లైన్‌క్లియర్



పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం/గాజువాక, మార్చి 14: గాజువాక అసెంబ్లీ నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ తమ అభ్యర్థిగా గురువారం పల్లా శ్రీనివాసరావును ప్రకటించింది. దీంతో గత కొద్దిరోజులుగా నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడింది. పొత్తులో భాగంగా గాజువాక సీటును జనసేన పార్టీకి కేటాయిస్తారని, పవన్‌కల్యాణ్ పోటీ చేస్తారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. దీంతో ఇరు పార్టీల నేతల్లోను ఉత్కంఠ నెలకొంది. అయితే జనసేన అధినేత కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో గాజువాకలో పల్లా శ్రీనివాస రావుకు లైన్‌క్లియర్ అయ్యింది. ఈ మేరకు అధిష్ఠానం పల్లా శ్రీనివాసరావు పేరును అధికారికంగా ప్రకటించింది.

పల్లా రాజకీయ నేపథ్యం

పల్లా శ్రీనివాసరావు తండ్రి సింహాచలం కార్మిక నాయకులు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు విశాఖ-2 సెగ్మెంట్ నుంచి తెలుగుదేశం తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తండ్రికి రాజకీయాల్లో శ్రీనివాసరావు చేదోడువాదోడుగా ఉండేవారు. 2009లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ప్రజారాజ్యం పార్టీలో చేరి విశాఖ పార్లమెంటు స్థానానికి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో మూడు లక్షలకుపైగా ఓట్లు సాధించారు. ఆ తరువాత ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌లో విలీనం అయ్యింది. రాష్ట్ర విభజన అనంతరం 2014 సార్వత్రిక ఎన్నికల ముందు కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరి గాజువాక నుంచి పోటీ చేసి 22 వేల మెజారిటీతో విజయం సాధించారు. 2019లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

2020లో జిల్లా అధ్యక్షునిగా....

2019 ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీని మరింత పటిష్ఠ పరిచారు. ఈ క్రమంలోనే2020లో జిల్లా పార్టీ అధ్యక్షుని పగ్గాలు చేపట్టారు.

చోడవరం టీడీపీ అభ్యర్థిగా రాజు

- వరుసగా నాలుగోసారి పోటీ



కేఎస్ఎన్ఎస్ రాజు

రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున చోడవరం నుంచి మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు (టీడీపీ) పోటీ చేయనున్నారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు గురువారం విడుదల చేసిన రెండో జాబితాలో రాజుకు చోటు లభించింది. చోడవరం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడం వరుసగా నాలుగోసారి అవుతుంది. కేఎస్ఎన్ఎస్ రాజు విద్యార్థి దశలోనే రాజకీయాల్లో ప్రవేశించారు. తొలుత కాంగ్రెస్ పార్టీలో వున్న ఆయన చోడవరం సర్పంచ్‌గా గెలిచారు. తరువాత తెలుగుదేశం పార్టీలో చేరారు. పీఏసీఎస్ అధ్యక్షునిగా, ఎంపీపీగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కరణం ధర్మశ్రీపై గెలిచారు. 2014 ఎన్నికల్లో ఆయన టీడీపీ తరఫున పోటీ చేయగా, వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కరణం ధర్మశ్రీని మరోసారి ఓడించారు. గత ఎన్నికల్లో ధర్మశ్రీ చేతిలో ఓటమి పాలయ్యారు. కాగా చోడవరం టికెట్‌ను రాజుతోపాటు నియోజకవర్గం ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు ఆశించారు. అయితే పార్టీ అధిష్ఠానం వివిధ అంశాలను పరిశీలించిన మీదట రాజుకు టికెట్ ఖరారు చేసినట్టు తెలిసింది. కాగా చోడవరం అభ్యర్థిగా రాజుపేరును పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన వెంటనే పార్టీ పలువురు నాయకులు, కార్యకర్తలు చోడవరం వచ్చి ఆయనను అభినందించారు.

'పైలా'కు దక్కిన మాడుగుల టికెట్

- ఎట్టకేలకు ఫలించిన ప్రయత్నాలు



పైలా ప్రసాదరావు

మాడుగుల నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా పైలా ప్రసాదరావు పేరును అధినేత చంద్రబాబునాయుడు ఖరారు చేశారు. ఎన్ఆర్ఐ అయిన పైలా ప్రసాదరావు 2009లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఆ ఎన్నికల్లో మాడుగుల నుంచి ప్రజారాజ్యం పార్టీ తరఫున 2009లో పోటీ చేసి సుమారు 23 శాతం ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు. తరువాత పీఆర్పీ కాంగ్రెస్‌లో విలీనం కావడంతో ఆయన 2011లో తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. టీడీపీ అధికారంలో వున్నప్పుడు ఏపీ జన్మభూమి కమిటీ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహించారు. 2014, 2019 ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించినప్పటికీ అవకాశం లభించలేదు. ఎట్టకేలకు మూడోసారి ఆయన ప్రయత్నం ఫలించింది. మాడుగుల టికెట్ విషయంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీజీ కుమార్‌ల నుంచి గట్టిపోటీ ఎదురైనప్పటికీ చివరకు పార్టీ అధిష్ఠానం ప్రసాదరావుకే మొగ్గు చూపింది.

నాలుగోసారి బరిలోకి పంచకర్ల రమేశ్



పంచకర్ల రమేశ్‌బాబు

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు నాలుగోసారి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఈసారి జనసేన పార్టీ తరఫున పెందుర్తి నుంచి పోటీ చేసే అవకాశం ఆయనకు లభించింది. చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు ఆయన అందులో చేరి 2009లో పెందుర్తి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆ తరువాత ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌లో విలీనమైంది. తదనంతరం చోటుచేసుకున్న పరిణామాల్లో పంచకర్ల టీడీపీలో చేరారు. 2014లో టీడీపీ తరఫున ఎలమంచిలి నుంచి పోటీ చేసి గెలిచారు. 2019లో కూడా మరోమారు ఎలమంచిలి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. నాలుగేళ్ల క్రితం టీడీపీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. ఆ పార్టీ నగర అధ్యక్షుడిగా పనిచేశారు. అక్కడ సరైన గౌరవం ఇవ్వడం లేదని జనసేనలోకి వచ్చారు. అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. సీనియర్ కావడంతో ఆయన కోరుకున్న పెందుర్తి స్థానం ఇచ్చారు.

ఎలమంచిలి జనసేన అభ్యర్థిగా సుందరపు



సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, మార్చి 14: ఎలమంచిలి నియోజకవర్గం అభ్యర్థిగా సుందరపు విజయకుమార్ పేరును జనసేన పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఎలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలం మామిడివాడ కొత్తూరు గ్రామానికి చెందిన విజయకుమార్ 2012లో తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. 2013లో ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ఉన్నారు. 2014 ఎన్నికల్లో టికెట్ ఆశించారు. అయితే పార్టీ అధిష్ఠానం పంచకర్ల రమేశ్‌బాబుకు అవకాశం ఇచ్చింది. దీంతో ఆయన తెలుగుదేశం పార్టీని వీడారు. కొంతకాలం తరువాత జనసేన పార్టీలో చేరారు. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున పోటీ చేసి సుమారు 20 వేల ఓట్లు పొందారు. అప్పటి నుంచి ఎలమించిలి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పొత్తులో భాగంగా ఎలమంచిలి స్థానాన్ని జనసేనకు కేటాయించారు. దీంతో పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ గురువారం సుందరపు విజయకుమార్‌ను ఎలమంచిలి అభ్యర్థిగా ప్రకటించారు. కూటమిలో వున్న మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలతో సహకారం, సమష్టి కృషితో విజయం సాధిస్తానని విజయకుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించిన పవన్‌కల్యాన్, చంద్రబాబునాయుడు, లోకేశ్‌లకు రుణపడి ఉంటానన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం

పోలింగ్ విధులకు 10 వేల మంది సిబ్బంది

- జిల్లా ఈఆర్‌ఓగా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి
- అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏఈఆర్‌ఓల నియామకం
- డబ్బు, మద్యం రవాణా కట్టడికి 24 చెక్‌పోస్టులు, 24 ఫ్లయింగ్ బృందాలు
- కలెక్టరేట్‌తోపాటు ఎనిమిదిచోట్ల కమాండ్ కంట్రోల్ టీమ్‌లు ఏర్పాటు



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎన్నికల సంఘం సన్నద్ధమవుతున్నది. అనకాపల్లి లోక్‌సభ నియోజక వర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు 10 వేల మంది సిబ్బంది అవసరమని గుర్తించింది. ఈ మేరకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులను ఎన్నికల సంఘం నియమించింది. జిల్లా ఎన్నికల అధికారి(ఈఆరోఓ)గా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి నియమితులయ్యారు. ఆయనతోపాటు అసెంబ్లీ నియోజకవర్గాలకు సహాయక ఎన్నికల అధికారులను (ఏఈఆర్‌ఓ)లను నియమించింది. అనకాపల్లి ఏఈఆర్‌ఓగా జాయింట్ కలెక్టర్ జాహ్నవి, చోడవరం అసెంబ్లీకి అనకాపల్లి ఆర్డీఓ చిన్నికృష్ణ, మాడుగులకు ఏపీఐఐసీ ఎస్‌డీసీ జీవీ సత్యవాణి, పెందుర్తికి కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ శేషశైలజ, ఎలమంచిలికి ఎన్ఏటీటీ ఎస్‌డీసీ కె.మనోరమ, నర్సీపట్నానికి స్థానిక ఆర్డీవో జయరామ్, పాయకరావుపేట ఏఈఆర్‌ఓగా సింహాచలం దేవస్థానం భూసంరక్షణ విభాగం ఎస్‌డీసీ కె.గీతాంజలి వ్యవహరించనున్నారు. ఎన్నికలు సమర్థంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా ఎన్నికల అధికారులు ఆయా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన మరుక్షణం నుంచే నియమావళిని అమలు చేయనున్నారు.

ఎన్నికల నిర్వహణకు 10 వేల మంది

జిల్లాలో పోలీసు శాఖతోపాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 10 వేల మంది ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొనే అవకాశం ఉందని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. జిల్లాలో 1,529 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 332 ఉన్నట్టు గుర్తించారు. 145 మంది సెక్టోరియల్ అధికారులు, 145 మంది పోలింగ్ అధికారులను నియమించారు. మరో 12 మందిని రిజర్వులో వుంచారు. ఎన్నికల నోడల్ అధికారులుగా 16 మందిని నియమించారు. ఎన్నికల వేళ డబ్బు, మద్యం రవాణాపై నిఘా పెట్టేందుకు 24 చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నారు. 24 ఫ్లయింగ్ బృందాలను నియమించనున్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై నిఘా పెట్టేందుకు ఎనిమిది ప్రత్యేక బృందాలను నియమించారు. కలెక్టరేట్‌తోపాటు ఎనిమిదిచోట్ల కమాండ్ కంట్రోల్ టీమ్‌లను నియమించారు.

ఏసీబీకి చిక్కిన ఆరిలోవ ఎస్‌ఐ

స్టేషన్‌లో సెటిల్‌మెంట్

- అందుకుగాను రూ.30 వేలు డిమాండ్
- రూ.పది వేలు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వైనం
- లంచం ఇవ్వనంటే బాధితుడి స్నేహితుడి వద్ద ఫోన్ లాక్కుని... డబ్బులు ఇచ్చి తీసుకువెళ్లామన్న అధికారి



లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎస్‌ఐ సీహెచ్ హరికృష్ణ

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆరిలోవ ఎస్‌ఐ సీహెచ్ హరికృష్ణ గురువారం లంచం తీసు కుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. దీనికి సంబంధించి అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా బొండపల్లికి చెందిన ఒకరు విశాఖ నగరంలోని ఆరిలోవ ప్రాంతానికి చెందిన వ్యక్తి వద్ద కారు కొనుగోలు చేశారు. కారుపై ఉన్న ఫైనాన్స్‌ను ప్రతి నెలా కొనుగోలుదారే చెల్లించుకునేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా కారు కొనుగోలు చేసిన వ్యక్తి కొన్ని నెలలుగా ఫైనాన్స్ వాయిదాలను చెల్లించలేకపోయారు. కారును విక్రయించిన వ్యక్తికి బ్యాంకు అధికారుల నుంచి ఒత్తిడి పెరగడంతో వారం కిందట ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్‌ఐ హరికృష్ణ కేసు నమోదు చేయకుండా ఇరువర్గాలను కూర్చోబెట్టి సెటిల్‌మెంట్ చేశారు. ఇప్పటివరకూ పెండింగ్‌లో ఉన్న వాయిదాలకు సంబంధించిన ... మిగతా 8వ పేజీలో

గర్భిణుల అవస్థలు

నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రిలో సమయపాలన పాటించని వైద్యులు

- ఉదయం 11.20 గంటల వరకు మొదలుకాని గైనిక్ ఓపీ సేవలు
- గర్భిణులు గంటల తరబడి నిరీక్షణ
- నిల్చునే ఓపిక లేక పలువురు తిరుగుముఖం



డాక్టర్ కోసం ఎదురు చూస్తున్న గర్భిణులు

నర్సీపట్నం, మార్చి 14:

స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో గర్భిణులకు వైద్య సేవలు నానాటికీ తీసికట్టుగా తయారవుతున్నాయి. గైనిక్ వైద్యులు సమయ పాలన పాటించడంలేదు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గర్భిణులు ఓపీ వద్ద పడిగాపులు కాస్తున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం తొమ్మిది గంటలకు ఓపీ మొదలుపెట్టాలి. డాక్టర్ నిర్ణీత సమయానికే వచ్చి ఓపీ మొదలుపెడతారన్న ఉద్దేశంతో ఎనిమిది గంటల నుంచే గర్భిణులు రావడం ప్రారంభించారు. కానీ గైనికాలజీ వైద్య నిపుణులు 11.20 గంటల వరకు రాలేదు. దీంతో గర్భిణులు గంటల తరబడి నిలబడలేక, కూర్చోడానికి సరిపడ కుర్చీలు, బెంచీలు లేక నానా అవస్థలు పడ్డారు. కొంతమంది అయితే వైద్య పరీక్షలు చేయించుకోకుండానే ఆస్పత్రి నుంచి తిరుగుముఖం పట్టడం కనిపించింది.

నర్సీపట్నంతోపాటు చుట్టు పక్కల మండలాల నుంచి ఏరియా ఆస్పత్రిలో ప్రసూతి సేవలు కోసం అధికంగా వస్తుంటారు. రోజూ 70 నుంచి 80 వరకు ఓపీ ఉంటుంది. నెలకు సగటున 350 కాన్పులు జరుగుతుంటాయి. వైద్య నిపుణులు లక్ష్మణరావు, గౌతమినాయుడు, చేతన, పద్మిణీ ప్రసూతి విభాగంలో గైనికాలజిస్టులు పని చేస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం డాక్టర్ లక్ష్మణరావు గురువారం ఓపీ చూడాలి. మిగిలిన ముగ్గురు డాక్టర్లు వార్డుల్లో రౌండ్స్, ఆపరేషన్లు, డెలివరీ వంటి విధులు నిర్వహిస్తారు. గురువారం ఉదయం ఓపీకి డాక్టర్ లక్ష్మణరావు హాజరుకాలేదు. ఇదే సమయంలో ఆస్పత్రికి ... మిగతా 8వ పేజీలో



ప్రసూతి విభాగం ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ దగ్గర గర్భిణులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్ర)	6.10
సహరి (శని)	4.52

ఎక్స్‌ప్రెస్ బస్సుల యోగ్యం లేదా?

ఎలమంచిలి వాసులు ఆవేదన

- కొక్కిరాపల్లి వద్ద రైల్వే గేటుతో 15 ఏళ్ల నుంచి పట్టణంలోకి రాని ఎక్స్‌ప్రెస్ బస్సులు
- దూరప్రాంతాలకు వెళ్లాలంటే ప్రయాణికుల ఇక్కట్లు
- ఎట్టకేలకు పూర్తయిన రైల్వే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం
- ఇప్పటికైనా ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని ప్రజలు వినతి



పల్లె వెలుగు, మెట్రో బస్సులకే పరిమితమైన ఎలమంచిలి బస్టాండ్

ఎలమంచిలి, మార్చి 14: రైల్వే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం పూర్తయి, వాహనాల రాకపోకలకు అందుబాటులోకి వచ్చినప్పటికీ ఎలమంచిలి వాసులు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే భాగ్యానికి నోచుకోలేదు. రైల్వే గేటు నెపంతో సుమారు పుష్కరకాలం నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సులేవీ ఎలమంచిలి బస్టాండ్‌కు రావడంలేదు. దీంతో దూరప్రాంతాలకు వెళ్లాల్సిన ఎలమంచిలి ప్రయాణికులు అటు అనకాపల్లి లేదంటే ఇటు అడ్డరోడ్డుకు వెళ్లి ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎక్కాల్సి వస్తున్నది.

ఎలమంచిలి సమీపంలోని కొక్కిరాపల్లి రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణ పనులకు పదిహేనేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. కానీ వివిధ కారణాల వల్ల వంతెన నిర్మాణంలో తీవ్రజాప్యం జరిగింది. మరోవైపు ఈ మార్గంలో ట్రాఫిక్ అధికం కావడం, ఇదే సమయంలో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరగడంతో రైల్వే గేటును తరచూ వేయాల్సి వస్తున్నది. వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎలమంచిలి బస్టాండ్‌లోకి రాకుండా జాతీయ రహదారిమీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. అనకాపల్లి- పాయకరావుపేట మధ్య తిరిగే పల్లె వెలుగు, విశాఖ-ఎలమంచిలి మధ్య తిరిగే మెట్రో బస్సులు మాత్రమే బస్టాండ్‌లోకి వస్తున్నాయి. ఎలమంచిలి ప్రజలు రాజమండ్రి, కాకినాడ, అమలాపురం వంటి దూర ప్రాంతాలకు వెళ్లాలంటే అడ్డరోడ్డు లేదా అనకాపల్లి వెళ్లి ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎక్కాల్సి వస్తున్నది. అదే విధంగా తుని వైపు నుంచి ఎలమంచిలికి వచ్చే వారు అనకాపల్లికి, విశాఖ వైపు నుంచి వచ్చే వారు నక్కపల్లి వరకు టికెట్ తీసుకుని, డ్రైవర్‌ను బతిమాలుకుని బైపాస్ రోడ్డులో దిగాల్సి వస్తున్నది. బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సామాజికవేత్తలు ఈ సమస్యలను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కొన్నింటినైనా ఎలమంచిలి మీదుగా నడపాలని కోరినా పట్టించుకోలేదు. కాగా రైల్వే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం ఎట్టకేలకు ఇటీవల పూర్తయ్యింది. వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎలమంచిలి బస్టాండ్‌కు వచ్చిపోయేలా చర్యలు చేపట్టాలని, ఇందుకోసం ప్రజాప్రతినిధులు కృషి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రైం... crime news

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


జామి సన్యాసినాయుడు (ఫైల్ ఫొటో)

బుచ్చెయ్యపేట, మార్చి 14: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని వడ్డాది పంచాయతీ శివారు కొత్తూరులో చోటుచేసుకుంది. ఈ సంఘటకు సంబంధించి ఎస్‌ఐ డి.ఈశ్వరరావు వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

దేవరాపల్లికి చెందిన జామి సన్యాసినాయుడు(36)కు వడ్డాది పంచాయతీ శివారు కొత్తూరు గ్రామానికి చెందిన వరలక్ష్మితో సుమారు 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. సన్యాసినాయుడు కొత్తూరులోనే ఇల్లు అద్దెకు తీసుకుని భార్యతో ఇక్కడే కాపురం పెట్టాడు. స్థానికంగా కలాసీ, తాపీ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు వున్నారు. అయితే మూడేళ్ల నుంచి భార్యాభర్తల మధ్య సఖ్యత లోపించి తరచూ గొడవ పడుతున్నారు. పిల్లలను తీసుకుని సొంతూరు దేవరాపల్లి వెళ్లిపోదామని చెప్పగా, భార్య ఒప్పుకోలేదు. ఈ నేథప్యంలో బుధవారం భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. వరలక్ష్మి పిల్లలను తీసుకుని సమీపంలోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంటిలో సన్యాసినాయుడు ఒక్కడే వున్నాడు. బుధవారం రాత్రి పక్కింటి వారు సన్యాసినాయుడు ఇంటి కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కి ఉరేసుకుని కనిపించాడు. వెంటనే ఈ విషయాన్ని వరలక్ష్మికి చెప్పడంతో పిల్లలను తీసుకుని ఇంటికి వచ్చింది. సన్యాసినాయుడు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. దేవరాపల్లి నుంచి సన్యాసినాయుడు కుటుంబ సభ్యులు కూడా వచ్చారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

భర్తతో గొడవపడి ఆత్మహత్య

బుచ్చెయ్యపేట, మార్చి 14: మండలంలోని వడ్డాది గ్రామంలో వివాహిత ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. వడ్డాది సంతబయలు వద్ద తగుడుపల్లి తాతారావు, భార్య మహాలక్ష్మి(60) నివాసం వుంటున్నారు. వ్యవసాయ కూలీలైన వీరు ఇటీవల ఉమ్మడి గోదావరి జిల్లాలో మినుము, పెసర పంటల కోతల పనులకు వెళ్లారు. గురువారం ఉదయం తిరిగి వడ్డాది వచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కొద్దిసేపటి తరువాత మహాలక్ష్మి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఈ విషయం గమనించిన తాతారావు, వెంటనే చికిత్స నిమిత్తం చోడవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాడు. ప్రథమ చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స చేయకముందే మృతిచెందింది. భర్త తాతారావు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

60 లీటర్ల నాటుసారా స్వాధీనం

బుచ్చెయ్యపేట, మార్చి 14: మండలంలోని నీలకంఠాపురంలో గురువారం నాటుసారా బట్టీపై దాడి చేసి 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. సారా తయారీకి సిద్ధం చేసిన 500 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశామని, నాటుసారా బట్టీ నడుపుతున్న పడాల నాయుడును అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

మాసాహెబ్‌పేటలో 40 లీటర్లు...

పాయకరావుపేట, మార్చి 14: మాసాహెబ్‌పేట ప్రాంతంలో ఎస్‌ఈబీ అధికారులు 40 లీటర్ల నాటుసారాతో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఈబీ సీఐ ఎస్.ధర్మారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాసాహెబ్‌పేట వద్ద సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన దొంగల సత్యనారాయణ, గంటా వెంకటరమణ రెండు ప్లాస్టిక్ సంచుల్లో 40 లీటర్ల నాటుసారాను ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

పురుషోత్తపురంలో మూడు ఇళ్లల్లో చోరీలు

ఎలమంచిలి, మార్చి 14: మండలంలోని పురుషోత్తపురంలో ఒకే కాలనీలోని మూడు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. రూరల్ ఎస్‌ఐ సింహాచలం తెలిపిన వివరాల ప్రకారం.. పురుషోత్తపురం దళిత కాలనీలో పి.శాంతికుమారి, వెంకట చినబ్బాయితోపాటు మరో వ్యక్తి ఇంట్లో బుధవారం రాత్రి చోరీలు జరిగాయి. సుమారు ఐదు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. బాధితులు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలాలను రూరల్ ఎస్‌ఐతో పాటు, క్లూస్‌టీమ్ సిబ్బంది పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ తెలిపారు.

మసాజ్ సెంటర్‌లో పట్టుబడిన ఎస్‌ఐ

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మసాజ్ సెంటర్‌లో యువతులతో అభ్యంతరకరమైన స్థితిలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఒకరు పోలీసుల ఆకస్మిక దాడుల్లో పట్టుబడడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. స్పాల ముసుగులో చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు అందడంతో సీపీ రవిశంకర్ అయ్యన్నార్ బుధవారం రాత్రి ఆకస్మిక సోదాలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో నగరంలోని 64 స్పా/మసాజ్ సెంటర్లలో 200 మంది పోలీసులు బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు మసాజ్ సెంటర్లలో యువతులతో మగవారికి మసాజ్ చేయిస్తుండడం, అభ్యంతరకరమైన రీతిలో మరికొందరు కనిపించడంతో పోలీసులు ఆయా సెంటర్లపై కేసులు నమోదుచేశారు. ఏడుగురు పురుషులను అరెస్టు చేశారు. అలాగే ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 17 మంది యువతులను స్వధార్‌హోమ్‌కు అప్పగించారు. కాగా కంచరపాలెం స్టేషన్ పరిధిలోని ఒక మసాజ్ సెంటర్‌లో సోదాలు నిర్వహించేందుకు వెళ్లిన పోలీసులకు అభ్యంతరకరమైన రీతిలో ఒకరు పట్టుబడ్డారు. అతడిని విచారించగా తాను కంట్రోల్‌రూమ్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్నట్టు వెల్లడించాడు. పోలీసులు ఆ సమాచారం ఆధారంగా పోలీసులు ఆరా తీయగా 2014 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐగా తేలడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారి ఆదేశాల మేరకు అతనిపై కూడా విటుడిగా కేసు నమోదుచేశారు. .

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి: కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 14: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారులు బీఐఎస్ స్టాండర్డ్ లేని హెల్మెట్లు విక్రయించకుండా చూడాలని, వాటిని విక్రయించిన దుకాణాలపై కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో ప్రమాదాలు జరిగే అవకాశాలున్న బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ పోలీస్, రవాణాశాఖ అధికారుల సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ స్మరన్‌రాజ్, ఏఎస్పీ విజయభాస్కర్, జిల్లా రవాణా అధికారి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

గౌరీపట్నంలో అర్ధంతరంగా ముగిసిన విచారణ

చోడవరం, మార్చి 14: మండలంలోని గౌరీపట్నంలో భూముల రీసర్వేలో రెవెన్యూ సిబ్బంది నిర్వాకం, తదనంతర పరిణామాలపై గురువారం అధికారులు నిర్వహించిన గ్రామసభ ప్రజల అభ్యంతరాలతో అర్ధంతరంగా ముగిసింది. గౌరీపట్నంలో భూముల రీసర్వే సందర్భంగా అప్పటి వీఆర్వో, సచివాలయ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది కలిసి ఒకరి పేరిట ఉన్న భూములకు మరొకరి పేరుతో పట్టాలు జారీ చేయడం, రెవెన్యూ ఉద్యోగి ఒకరు తన పేరిట, తన కుటుంబ సభ్యుల పేరిట రైతుల భూములు నమోదు చేయడంపై గత ఏడాది డిసెంబరులో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణకు కలెక్టర్ ఆదేశించగా అధికారులు గ్రామంలో విచారణ జరిపి సర్వేయర్ల తప్పిదాలు ఉన్నట్టు నిర్ధారించారు. బాధ్యులైన వీఆర్వో, సచివాలయం సర్వేయర్‌ను సస్పెండ్ చేశారు. అయితే సస్పెండైన వీఆర్వోకు తిరిగి పోస్టింగ్ ఇచ్చిన అధికారులు, సర్వేయర్‌పై వచ్చిన ఆరోపణలపై జిల్లా సర్వే అధికారి వెంకన్న ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించడానికి గురువారం గౌరీపట్నం వచ్చారు. తప్పులను సరిదిద్దకుండా వీఆర్వోకు తిరిగి పోస్టింగ్ ఇవ్వడంతోపాటు, సర్వేయర్‌కు తిరిగి పోస్టింగ్ ఇవ్వడానికి గ్రామసభ నిర్వహించడానికి రావడమేమిటేని ఎంపీటీసీ సభ్యుడు మంగా జగన్నాథరావు, తదితరలు నిలదీశారు. దీంతో అధికారులు విచారణ చేయకుండానే వెనుదిరిగారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

మామిడి తోటలు వెలవెల!

కాపులేక కళతప్పిన చెట్లు

- గత ఏడాది వర్షాభావంతో రెండు నెలలు ఆలస్యంగా పూత
- పొగమంచు ప్రభావంతో తెగుళ్లు విజృంభణ
- సగానికిపైగా రాలిపోయిన పూత
- మార్చి రెండో వారం గడుస్తున్నా కానరాని కాయలు
- ఎకరాకు రూ.30 వేల మేర పెట్టుబడి
- దిగుబడిపై ఆశలు వదులుకుంటున్న సాగుదారులు


బంగారుమెట్టలో పూత, పిందెలేని లేని మామిడి చెట్లు


ఎల్‌బీపీ అగ్రహారంలో పొగమంచు ప్రభావంతో మాడిపోయిన పూత

బుచ్చెయ్యపేట, మార్చి 14: ప్రస్తుత సమయానికి పిందెలు, కాయలతో కళకళలాడాల్సిన మామిడి తోటలు ఈ ఏడాది కనీస స్థాయిలో కూడా కాపు కాయక వెలవెల బోతున్నాయి. గత ఏడాది నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా మామిడి చెట్లకు ఈసారి పూత ఆలస్యంగా, అంతంతమాత్రంగానే వచ్చింది. ఈ సమయంలో పొగమంచు దట్టంగా కురవడంతో తెగుళ్లు, కీటకాలు విజృంభించాయి. దీంతో పూత మాడిపోయింది, పిందెలు రాలిపోతున్నాయి. సగటు దిగుబడిలో నాలుగో వంతు కూడా రావడం కష్టమేనని మామిడి తోటల సాగుదారులు చెబుతున్నారు.

బుచ్చెయ్యపేట మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో మామిడి తోటలు వున్నాయి. ప్రతిఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో మామిడి తోటల్లో పూత వస్తుంది. జనవరిలో పిందెలు ఏర్పడి, ఫిబ్రవరి నుంచి కాయలుగా పెరుగుతాయి. ఏప్రిల్ చివరి వారం నుంచి జూన్ వరకు కాయలు కోస్తుంటారు. వాతావరణం అనుకూలిస్తే రకాన్నిబట్టి ఎకరాకు 5 నుంచి 8 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. కానీ ఈ ఏడాది మామిడి తోటల్లో కాపు ఆశాజనకంగా లేదు. గత ఏడాది నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులు మామిడి రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. నవంబరు, డిసెంబర్‌లో పూతకు రావాల్సిన మామిడి చెట్లు.. డిసెంబరు మొదటి వారంలో తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా ఫిబ్రవరి, మార్చి నెలల్లో పూత పూస్తున్నాయి. అది కూడా అరకొరగానే వచ్చింది. గతంతో పోలిస్తే 30 శాతం పూత కూడా రాలేదని రైతులు చెబుతున్నారు. ఇదే సమయంలో మంచు అధికంగా కురవడం, పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో తీవ్ర వ్యత్యాసం వుండడంతో తేనె మంచు, తామర పురుగులు, పేను బంక, మంగు వంటి తెగుళ్లు వ్యాపించి పూతకు నష్టం కలిగించాయి. మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకపోయిందని సాగుదారులు వాపోతున్నారు. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు ఐదు నుంచి ఎనిమిది టన్నుల వరకు మామిడి కాయల దిగుబడి వస్తుందని, ఈ ఏడాది రెండు టన్నులు దిగుబడి వస్తే గొప్ప విషయమని అంటున్నారు.

ఎకరాకు రూ.30 వేలు ఖర్చు చేశాను



నాకు ఐదు ఎకరాల మామిడి తోట వుంది. కలుపు తీత, నీటి తడులు, సూక్ష్మపోషకాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలి ఖర్చులు కలిపి ఇంతవరకు ఎకరాకు రూ.30 వేల చొప్పున లక్షన్నర రూపాయలు అయ్యింది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించక పోవడంతో తక్కువ పూత.. అది కూడా ఆలస్యంగా వచ్చింది. ఇదే సమయంలో మంచు అధికంగా కురవడంతో చాలా వరకు రాలిపోయింది. దీంతో కాపు బాగా తగ్గిపోయే పరిస్థితి నెలకొంది. పెట్టుబడి కూడా వచ్చేలా లేదు.

సాయం రఘునాథ్, మామిడి రైతు, బంగారుమెట్ట

కూటమి అధికారంలోకి వస్తేనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

- మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ


ర్యాలీలో పాల్గొన్న జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు

కొత్తూరు, మార్చి 14 : రాష్ట్రంలో యువత భవిష్యత్తు బాగుపడాలంటే జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అధికారంలోకి రావాల్సిందేనని జనసేన పార్టీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అన్నారు. గురువారం జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని రింగురోడ్డులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ అధికారంలోకి రావాలన్నారు. అనంతరం మళ్ల బ్రదర్స్ కూడలి మీదుగా నెహ్రూచౌక్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పొన్నగంటి అప్పారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మూడు పార్టీల నాయకులు కాయల మురళి, నిమ్మదల సన్యాసిరావు, డాక్టర్ నారాయణరావు, బొలిశెట్టి సత్యనారాయణ, దూలం గోపీ, మళ్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట సభను విజయవంతం చేద్దాం

తుమ్మపాల, మార్చి 14 : టీడీపీ, జనసేన, బీజేపీల ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో ఈ నెల 17న జరగనున్న భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర నుంచి బహిరంగసభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావాలన్నారు. ఈ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పాల్గొంటారని చెప్పారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు


మైనర్ బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో శ్రీగౌరి

కృష్ణాదేవిపేట, మార్చి 14 : గొలుగొండ ఏఎల్‌పురం గొల్లవీధిలో గురువారం బాల్యవివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఏఎల్‌పురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలిక(15)ను, అడ్డబోయిన సాయికృష్ణ(19)కు ఇచ్చి ఈ నెల 15వ తేదీన వివాహం చేయాలని ఇరుకుటుంబాల పెద్దలు ఇటీవల నిశ్చయించుకున్నారు. దీనిపై ఐసీడీఎస్ గొలుగొండ సీడీపీవో శ్రీగౌరికి, స్థానిక సూపర్‌వైజర్ సత్యశ్రీకి సమాచారం అందింది. గురువారం పోలీసుల సహకారంతో బాలిక, యువకుడి ఇళ్లకు వెళ్లారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండకుండా వివాహం చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. తమ మాట కాదని పెళ్లి చేస్తే.. కుటుంబ సభ్యులు, పెళ్లి పెద్దలపై కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యపరంగా ఏర్పడే ఇబ్బందుల గురించి ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో పెళ్లిని వాయిదా వేసుకుంటున్నట్టు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ రామారావు, అంగన్‌వాడీ కార్యకర్త మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక నిఘా

- డీఎఫ్‌ఓ జగన్నాథ్‌సింగ్


విలేకర్లతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో జగన్నాథసింగ్ (ఎడమ వైపు)

కృష్ణాదేవిపేట, మార్చి 14: కలపను అక్రమంగా రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) జగన్నాథ్ సింగ్ హెచ్చరించారు. ఆయన గురువారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అటవీ కార్యాలయాన్ని, కొప్పుగొండనల్లగొండ అటవీ ప్లాంటేషన్లు, చింతాలమ్మఘాట్ రోడ్డులో జాతీయ రహదారి నిర్మాణం కోసం నరికివేసిన చెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణాదేవిపేటలో మీడియాతో మాట్లాడుతూ, పాతకృష్ణాదేవిపేట, పల్లావూరు, ఏఎల్‌పురం, తదితర గ్రామాల్లో ఫర్నీచర్ తయారీదారులు అటవీ శాఖకు నిర్ణీత ఫీజు చెల్లించిన తరువాత సామగ్రిని ఇతర ప్రాంతాలకు రవాణా చేయాలని స్పష్టం చేశారు. కలప అక్రమ రవాణాను నిరోధించడానికి చెక్‌పోస్టులు వద్ద నిఘాను పెంచుతామని చెప్పారు. ఆయన వెంట కృష్ణాదేవిపేట రేంజర్ సుంకర వెంకటరావు వున్నారు.

3,664 మందికి ఈబీసీ నేస్తం


నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 14: జిల్లాలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద మూడవ విడతలో 3664 మంది లబ్ధిదారులకు రూ.ఐదు కోట్ల 49 లక్షల 60 వేలు ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో గురువారం లబ్ధిదారులకు కలెక్టర్ నమూనా చెక్కును అందజేశారు. అంతకు ముందు నంద్యాల జిల్లా బనగానపల్లి నుంచి సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన ఈబీసీ నేస్తం కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు అధికారులు, లబ్ధిదారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని తిలకించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు వినూత్న పరికరం తయారీ


పరికరాన్ని తయారు చేసిన విద్యార్థినులతో విభాగాధిపతులు

అనకాపల్లి టౌన్, మార్చి 14: స్థానిక దైట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు మహిళల భద్రతకు ఓ వినూత్న పరికరాన్ని తయారు చేశారు. ఈ పరికరంతో ఆకతాయిల పని పట్టించవచ్చునని ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణప్రియ తెలిపారు. ప్రాజెక్టు గైడ్ ఎం.హేమలత, ప్రాజెక్టు ఇంజనీర్ బి.శేషగిరిరావు సూచనల మేరకు ఈ పరికరాన్ని వై.నిహారిక, పి.హేమలత, బి.ఓంసాయి, వాసంతి అనే విద్యార్థులు తయారు చేశారని పూర్ణ ప్రియ తెలిపారు. ఈ పరికరానికి అమర్చిన బటన్ నొక్కడం ద్వారా ఆపత్కాల సమయంలో మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రాజెక్టు ఇంజనీర్ బి.శేషగిరిరావు తెలిపారు. ఈ పరికరం తయారీకి ఫ్రీక్వెన్సీ ట్రాన్స్ ఫార్మర్, స్పార్క్ గ్యాప్ కెపాసిటర్, ఆన్ అండ్ ఆఫ్ స్విచ్, ఫ్రీక్వెన్సీ ట్రాన్సిస్టర్, రీచార్జబుల్ బ్యాటరీ వాడినట్లు విద్యార్థినులు తెలిపారు. ఈ పరికరం తయారు చేయడానికి కేవలం రూ.350లు ఖర్చు చేసినట్టు ప్రాజెక్టు ఇంజనీర్ బి.శేషగిరిరావు తెలిపారు.

పెందుర్తి సీటు బండారుకే కేటాయించాలి

- టీడీపీ శ్రేణుల ఆందోళన


బండారు ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు

పరవాడ, మార్చి 14: పెందుర్తి సీటును తెలుగుదేశం పార్టీ తీసుకుని, బండారు బండారు సత్యనారాయణమూర్తిని అభ్యర్థిగా ప్రకటించాలని ఆ పార్టీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. పొత్తులో భాగంగా పెందుర్తి నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించడంపై టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. గురువారం మండలంలోని వెన్నెలపాలెంలో గల బండారు ఇంటి వద్దకు చేరుకుని నిరసన తెలియజేశాయి. పెందుర్తి టికెట్ విషయంలో అధినేత చంద్రబాబునాయుడు మరోసారి పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. తామంతా ప్రస్తుతం పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నామని, రెండు రోజుల్లోగా టికెట్‌ను బండారుకు కేటాయిస్తున్నట్టు ప్రకటన చేయకపోతే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, గండి దేముడుబాబు, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, పార్టీ నాయకులు అట్టా సన్యాసిఅప్పారావు, వియ్యపు చిన్న, ఇందల కొండలరావు, కొటాన అప్పారావుతో పాటు పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఉన్నారు.

టీడీపీకి గండి బాబ్జీ రాజీనామా

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ గురువారం పార్టీకిఇ రాజీనామా చేశారు. పొత్తుల్లో భాగంగా దక్షిణ నియోజక వర్గాన్ని జనసేనకు కేటాయించారు. దీంతో తనకు మాడుగుల సీటు ఇస్తారని బాబ్జీ ఆశించారు. అయితే అధిష్ఠానం గురువారం విడుదల చేసిన మలి జాబితాలో మాడుగుల అభ్యర్థిగా పైలా ప్రసాదరావును ప్రకటించింది. దీంతో మనస్తాపానికి గురైన బాబ్జీ..దక్షిణ ఇన్‌చార్జి పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. పెందుర్తి నుంచి 2004లో ఎమ్మెల్యేగా గెలిచిన బాబ్జీ, 2014 తరువాత టీడీపీలో చేరారు.


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న రామ్‌చరణ్

విశాఖకు రామ్‌చరణ్

విశాఖపట్నం, మార్చి 14: ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'గేమ్ ఛేంజర్' సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు గురువారం నగరానికి విచ్చేసిన సినీ హీరో రామ్‌చరణ్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రాత్రి తొమ్మిది గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న ఆయనకు పెద్దసంఖ్యలో అభిమానులు స్వాగతం పలికారు. అనంతరం రామ్‌చరణ్ రోడ్డు మార్గంలో హోటల్ నోవాటెల్‌కు వెళ్లారు.

టీడీపీ అరకు ఎన్నికల పరిశీలకుడిగా సబ్బవరపు గణేశ్

అనకాపల్లి టౌన్, మార్చి 14: అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకు పార్లమెంట్, అరకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎన్నికల పరిశీలకుడిగా అనకాపల్లికి చెందిన ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ద్వారా ఉత్తర్వులు అందాయని గణేశ్ తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను విజయవంతంగా నిర్వర్తిస్తానని, పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఇంటర్ పరీక్షకు 14 వేల మంది హాజరు

అనకాపల్లి టౌన్, మార్చి 14: జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం రసాయన శాస్త్రం-1, కామర్స్ -1 పరీక్షలకు 14 వేల మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్ బోర్డు జిల్లా అధికారిణి సుజాత తెలిపారు. 14,598 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 598 మంది హాజరు కాలేదని తెలిపారు.

జీవీఎంసీ డ్రైవర్లపై అధికారుల వేధింపులు ఆపాలంటూ నిరసన

అనకాపల్లి టౌన్, మార్చి 14 : తమపై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ గురువారం జీవీఎంసీ కార్యాలయం వద్ద డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కోన లక్ష్మణ మాట్లాడుతూ జీవీఎంసీ అధికారులు వాహనాలకు మూడు మాసాలుగా మరమ్మతులు చేయించకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. అధికారులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల ప్రసాద్, గంజి నూకరాజు, కె. ప్రకాష్, ఆదినారాయణ, భాషా పాల్గొన్నారు.

జీవీఎంసీ హైస్కూల్‌కు డిజిటల్ ల్యాబ్ వితరణ

అనకాపల్లి టౌన్, మార్చి 14: స్థానిక జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు కెనరా బ్యాంక్ డిజిటల్ ల్యాబ్‌ను వితరణగా అందజేసింది. ఈ ల్యాబ్‌ను గురువారం కెనరాబ్యాంక్ రీజినల్ జాయింట్ మేనేజర్ ఐవీ కృష్ణప్రభు ప్రారంభించారు. ఈ డిజిటల్ ల్యాబ్ మంజూరులో పూర్వ విద్యార్థి, కెనరాబ్యాంక్‌లో డీజీఎం గుల్లపల్లి నరసింహమూర్తి కీలకపాత్ర వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ సీనియర్ మేనేజర్ సతీష్, అనకాపల్లి శాఖ సీనియర్ మేనేజర్ బాలకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం బ్రహ్మాజీ, విద్యా కమిటీ సభ్యుడు జాజుల రమేష్ పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి ఆలయం హుండీ లెక్కింపు

అనకాపల్లి టౌన్, మార్చి 14 : స్థానిక సుంకరమెట్ట జంక్షన్‌లోని సత్యనారాయణస్వామి ఆలయ హుండీ లెక్కింపు గురువారం పాలకవర్గం, అధికారుల సమక్షంలో జరిగింది. ఆలయానికి భక్తులు కానుకల రూపంలో రూ.లక్షా 50వేల 202లు ఆదాయం వచ్చిందని ఆలయ చైర్మన్ కేఎం నాయుడు, ఈవో కె. ఆదినారాయణ తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్ పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణరావుకు సీపీఎం నేతల నివాళులు

అనకాపల్లి టౌన్, మార్చి 14: స్థానిక సీపీఎం కార్యాలయంలో గిరిజన ఉద్యమ నేత ఎల్.లాలం లక్ష్మణరావు 18వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లాలం చిత్రపటానికి సీపీఎం నాయకులు ఆర్. శంకరరావు, కర్రి అప్పారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గంటా శ్రీరామ్, కె.ఈశ్వరరావు, బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్ష

అనకాపల్లి టౌన్, మార్చి 14 : స్థానిక కోర్టు వద్ద అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్టుకు నిరసనగా న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం కొనసాగాయి. ఈ దీక్షలో వి.రామచంద్ర నాయుడు, ఎం.మురళీ, అడపా సుధాకర్, ఎంజేవీఎస్ కుమార్ కూర్చున్నారని అసోసియేషన్ అధ్యక్షుడు సాయి తెలిపారు.

పాత పెన్షన్ పథకం మేనిఫెస్టోలో చేర్చండి : యూటీఎఫ్

అనకాపల్లి టౌన్, మార్చి 14 : పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలనే అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చాలని అనకాపల్లి టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణను యూటీఎఫ్ బృందం కోరింది. గురువారం ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ ఈ దఫా ఎన్నికల్లో ఓపీఎస్ అమలు చేసే పార్టీకే ఓటు వేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. ఈ విషయమై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దృష్టిలో పెడతామని కొణతాల తెలిపారన్నారు. కొణతాలను కలిసిన వారిలో వత్సవాయి శ్రీలక్ష్మి, జీఎస్ ప్రకాష్, కరుణజ్యోతి, దాడి వెంకటజగ్గఅప్పారావు, దేముడునాయుడు, అజయ్, తేజవర్ధన్, సతీష్ పాల్గొన్నారు.

రాజుపేట వీఆర్‌వో మృతి

కోటవురట్ల, మార్చి 14: మండలంలోని రాజుపేట వీఆర్‌వో లాలం సూరిబాబు అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈయన నాలుగేళ్లుగా రాజుపేట వీఆర్‌వోగా పనిచేస్తున్నారు. 15 రోజుల నుంచి సూరిబాబు అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి.

బీజేపీ నేతలను కలిసిన సుందరపు

అచ్యుతాపురం, మార్చి 14: జనసేన నియోజకవర్గపు ఇన్‌చార్జి సుందరపు విజయకుమార్ గురువారం బీజేపీ నాయకులను మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో తమ సహకారాలు అందిచాలని కోరారు. తాము పార్టీ ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని బీజేపీ నేతలు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ ఎలమంచిలి ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు, గొంతిన భక్త సాయిరాం, కె. నాయుడుబాబు, ఎం.కాసుబాబు, జనసేన నాయకులు బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, కె. పవన్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల షుగర్స్ కార్మికులకు చెక్కుల పంపిణీ

తుమ్మపాల, మార్చి 14: తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు విడుదలైన బకాయిల చెక్కులను గురువారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి కార్మిక కుటుంబాలకు అందజేశారు. 18 మంది పర్మినెంట్ కార్మికులు, 212 మంది ఎన్ఎంఆర్ కార్మికులు, సీజనల్ కార్మికుడు ఒకరికి ఐదు కోట్ల 17 లక్షల 28వేల 824 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు పాల్గొన్నారు.

ఫింగర్ ప్రింట్ ఇన్‌స్పెక్టర్‌గా విజయ బాధ్యతలు స్వీకారం

అనకాపల్లి రూరల్, మార్చి 14 : జిల్లా ఫింగర్ ప్రింట్ యూనిట్ ఇన్‌స్పెక్టర్‌గా టి. విజయ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఎస్పీ కేవీ మురళీకృష్ణను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమె విశాఖపట్నం సిటీ పోలీస్ ఫింగర్ ప్రింట్ యూనిట్ ఎస్ఐగా పనిచేస్తూ పదోన్నతిపై జిల్లా ఫింగర్ ప్రింట్ యూనిట్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చారు.

ఉపమాకలో అనిత ఎన్నికల ప్రచారం ప్రారంభం

నక్కపల్లి, మార్చి 14: పాయకరావుపేట టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థిని వంగలపూడి అనిత గురువారం సాయంత్రం 5 గంటలకు ఎన్నికల ప్రచారాన్ని ఉపమాకలో లాంఛనంగా ప్రారంభించారు. తొలుత ఉపమాక వెంకన్నను దర్శించుకొని, పూజలు చేశారు. ఆలయ దర్శనం అనంతరం సెంటిమెంట్‌గా ఆమె పలువురు ఓటర్లను కలిసి, సైకిల్ గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అనంతరం ఎన్నికల ప్రచార రథంపై నుంచి ఆమె మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గం అభివృద్ధి జరగలేదన్నారు. ఆమె వెంట టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, పెదిరెడ్డి చిట్టిబాబు, జానకి శ్రీను, అమలకంటి అబద్ధం, లాలం కాశీనాయుడు, ఏజెర్ల వినోద్‌రాజు, నల్లపరాజు వెంకట్రాజు, మజ్జూరి నారాయణరావు, కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి, బీజేపీ నాయకులు కోసూరి శ్రీను, పోలినాటి నానాజీ, జనసేన నాయకులు ఆకేటి గోవిందరావు, అప్పలరాజు, పిక్కిస్వామి పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో.. పాయకరావుపేట టీడీపీ. జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వంగలపూడి అనిత గురువారం ఎన్నికల ప్రచారాన్ని మండలంలోని సీతారాంపురంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ



ఉపమాకలో ఎన్నికల ప్రచారం ప్రారంభించిన ఉమ్మడి అభ్యర్థిని అనిత

సర్పంచ్ ఉరుకుట్ల వెంకటరమణ ఇంటి నుంచి ప్రచారం ప్రారంభించిన అనిత గ్రామంలో ఇంటింటికి వెళ్లి పార్టీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, అబద్ధం, జానకి శ్రీను, పెదిరెడ్డి శ్రీను, కె.వెంకటేశ్వరరావు, కాశీవిశ్వనాథ్, లాలం కాశీనాయుడు, ఎం.రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతు, కార్మికసంఘాల నిరసన

అనకాపల్లి టౌన్, మార్చి 14: కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం నెహ్రూచౌక్‌లో ఆ సంఘాల ప్రతినిధులు నిరసన చేపట్టారు. ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరైన రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, స్వామినాథన్ కమిటీ సిఫార్సు అమలు చేస్తామని, రైతుల రుణాలను మాఫీ చేస్తామని చెప్పి 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వై.ఎస్. భద్రం, రైతు సంఘాల నాయకులు కర్రి అప్పారావు, కోరిబిల్లి శంకరరావు, గాడి బాలు, కె. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో.. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పరవాడ సినిమాహాల్ జంక్షన్ వద్ద ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు పల్లి అప్పారావు, ఎస్.చిన్నారావు, ఎం.గోవింద్ పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. రైతులు పండిస్తున్న పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల చట్టం అమలుచేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు.గురువారం ఇక్కడ ఏపీ రైతు సంఘం, సీఐటీయూ



శిబిరం వద్ద మాట్లాడుతున్న సత్యనారాయణ

ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎం.మహేశ్ బాబు, జి. రమణ, సోమేశ్వరరావు, సోమేశ్,భూలోక, ఎ.అప్పారావు పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం సీఐటీయూ నేతలు ఇక్కడ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు, నేతలు వై.రాము, ఎన్ నారాయణరావు, వై.శ్రీనివాసరెడ్డి, రైతులు ఉన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

ఎలమంచిలి, మార్చి 14 : పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్ పార్టీ జండాను ఆవిష్కరించి, కేక్‌ను కట్‌చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పేద మహిళలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు లాలం సోమునాయుడు , గుర్రాల శేఖర్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. మండలంలోని హరిపురం జనసేన పార్టీ కేంద్రీయ కార్యాలయంలో గురువారం ఉత్తరాంధ్ర వ్యవహారాల ముఖ్యప్రతినిధి సుందరపు వెంకట సతీష్‌కుమార్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పలువురు జనసైనికులు సతీష్‌కుమార్‌ను పూలమాలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నేతలు పప్పల నూకన్నదొర, శ్రీనివాసరావు, త్రివేణి, నాయకులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో.. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం గురువారం పట్టణంలో ఘనంగా జరిగింది. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు



ఎలమంచిలిలో కేక్‌ను కట్ చేస్తున్న సుందరపు సతీష్.

చేసిన కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి తదితరులు కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, నాయకులు పల్లి దుర్గారావు, జగ్గన్నదొర, ఎగదాసి నానాజీ, వెలగా సుధాకర్, పప్పు శివ, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

వడ్డాది పాపయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి

కశింకోట, మార్చి 14 : కళా బ్రహ్మ వడ్డాది పాపయ్య అని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కొనియాడారు. గురువారం స్థానిక పీటీడీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రముఖ కళాకారుడు వడ్డాది పాపయ్య, మాజీ మంత్రి గుడివాడ గురునాధరావు విగ్రహాలను మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి ఆవిష్కరించారు. అనంతరం జెడ్ తుని గ్రామ సచివాలయం, పశువుల ఆసుపత్రి, రోడ్లు, కాలువలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, ఎంపీపీ కలగ లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, డాక్టర్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వడ్డాది పాపయ్య, గుడివాడ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎంపీ

వివాహిత అదృశ్యం

ఎలమంచిలి, మార్చి 14 : మండలంలోని మర్రిబంద గ్రామానికి చెందిన నాగలక్ష్మి అనే వివాహిత తన కుమారుడితో కలిసి కనిపించడం లేదని ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. నాగలక్ష్మి ఈనెల 8వ తేదీన బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదు అందిందన్నారు.

నాసిరకం హెల్మెట్లు అమ్ముతున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, మార్చి 14: స్థానిక జలగలమదుం జంక్షన్ వద్ద నాసిరకం హెల్మెట్లు అమ్ముతున్న కొమర అప్పన్నపై గురువారం కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు. ఐఎస్ఐ మార్కు లేకుండా అప్పన్న హెల్మెట్లు అమ్ముతుండడంతో రెండు హెల్మెట్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

'జనరిక్స్ ఫార్మాలో ప్రమాదంపై విచారణ జరిపించాలి'

అనకాపల్లి టౌన్, మార్చి 14 : రాంబిల్లి ఎస్ఈజెడ్ పరిధిలోని సింబయో జనరిక్స్ ఫార్మాలో బుధవారం జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు లేఖ రాసినట్టు తెలిపారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని, జ్యుడిషియల్ విచారణను జరిపించాలని కోరారు. కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు.

అనుమానితులపై బైండోవర్ కేసులు

అనకాపల్లి టౌన్, మార్చి 14 : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఒక లాడ్జిలో ఉన్న ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని గురువారం తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయించామని పట్టణ పోలీసులు తెలిపారు. నెల్లూరు, రాజమండ్రి ప్రాంతాలకు చెందిన ఇమ్మంది యువరాజ్‌కిరణ్, ఓ. గౌతమ్‌రెడ్డి, ఐ. కల్యాణ్ ఈశ్వర్, కె. చక్రవర్తి, పి. కార్తీక్‌లను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయించామని పోలీసులు తెలిపారు.

నూకాంబికకు టెన్త్ విద్యార్థుల పూజలు

అనకాపల్లి టౌన్, మార్చి 14 : మహాత్మా జ్యోతిరావ్ పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థులు గురువారం గురుకుల పాఠశాలలోను, నూకాంబిక ఆలయంలోను ప్రత్యేక పూజలు చేశారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు హాల్ టికెట్‌లను అమ్మవారి ముందు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు.

దొడ్డిదారిన టీచర్ల బదిలీ

▸▸ మొత్తం 90 మందికి విశాఖ నగరం, చుట్టుపక్కల పోస్టింగ్

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖ వింత పోకడలు పోతోంది. ఈ ఏడాది జూన్ నెలాఖరుకు ఖాళీ కానున్న పోస్టుల్లో ఇప్పుడే పలువురిని నియమిస్తూ ఆదేశాలు ఇస్తున్నది. నిబంధనలకు విరుద్ధంగా అంటే దొడ్డిదారిన ఉమ్మడి జిల్లాలో సుమారు 90 టీచర్లను తాము పనిచేసే పాఠశాలల నుంచి కోరుకున్న చోటకు బదిలీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు గురువారం జిల్లా విద్యాశాఖకు అందాయని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యవహారంలో సుమారు రూ.3.5 కోట్లు వరకూ చేతులు మారాయని, అధికార పార్టీ కీలక నేత పీఏ సూత్రధారిగా వ్యవహరించారని సమాచారం. ఏజెన్సీలో పనిచేస్తున్న 70 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు విశాఖ నగరం, పరిసరాలు, మైదాన ప్రాంతంలో స్కూళ్లలో పోస్టింగ్ తెచ్చుకున్నారు. అయితే ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం ఖాళీలు లేవు. రానున్న రెండు, మూడు నెలల్లో పలువురు టీచర్లు పదవీ విరమణ చేయనున్నారు. అప్పటివరకూ ఆయా ఉపాధ్యాయులు (ప్రస్తుతం బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్నవారు) ప్రస్తుతం పనిచేసే పాఠశాలల్లోనే పనిచేస్తారు. ఈ మేరకు విశాఖ జిల్లా శాఖాధికారి కార్యాలయానికి ఉత్తర్వులు వచ్చినా గోప్యంగా ఉంచుతున్నారు.

'ప్రతి రైతు ఒక వ్యాపారవేత్తగా అభివృద్ధి చెందాలి'

తుమ్మపాల, మార్చి 14 : ప్రతి రైతు ఒక వ్యాపారవేత్తగా అభివృద్ధి చెందాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి పేర్కొన్నారు. గురువారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఏర్పాటు చేసిన కామన్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భారత ఆహార శుద్ధి పరిశ్రమ శాఖ అందించిన రూ.3.5 కోట్లతో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు ఎల్. ప్రశాంతి, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్. ముకుందరావు, డాక్టర్ కేవీ రమణమూర్తి, డాక్టర్ జి. ఆదిలక్ష్మి, డాక్టర్ డి. ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గీతాంజలి మృతిపై కొవ్వొత్తుల ర్యాలీ

ఎస్.రాయవరం, మార్చి 14: ఇటీవల మృతి చెందిన గీతాంజలికి శ్రద్ధాంజలి ఘటిస్తూ అడ్డరోడ్డులో గురువారం రాత్రి వైసీపీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు , ఎంపీపీ కోన లోవలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అరుంధతి సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక

తుమ్మపాల, మార్చి 14 : అనకాపల్లిలోని భీమునిగుమ్మం అరుందతి సేవా సంఘం నూతన అధ్యక్షునిగా ఎల్.పెంటారావు, కార్యదర్శిగా యల్లబిల్లి కనకఅప్పారావు, కోశాధికారిగా ఓ.సూర్యనాగార్జున, సభ్యులుగా చెవ్వేటి అచ్యుతరావు, ఎల్.కామరాజు, బి.వెంకటరమణ, పెట్ల రమణ, కట్టమూరి అర్జునరావు, చెవ్వేటి గోవింద్ ఎన్నికయ్యారు.

పాండురంగస్వామి ఆలయ చైర్మన్‌గా అమరేశ్వరి

పాయకరావుపేట, మార్చి 14 : పాయకరావుపేటలోని పాండురంగ స్వామి ఆలయం చైర్మన్‌గా దగ్గుపల్లి అమరేశ్వరి నియమితులయ్యారు. గురువారం దేవస్థానం నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం జరిగింది. దేవదాయ ధర్మాదాయ శాఖ ఎలమంచిలి డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు నూతన చైర్మన్ అమరేశ్వరితో ప్రమాణస్వీకారం చేయించారు. అదేవిధంగా పాలకవర్గ సభ్యులుగా మజ్జి అప్పయమ్మ, రామాల వెంకటలక్ష్మి, అల్లంకి వెంకటలక్ష్మి, చిక్కాల రామలక్ష్మి, తూములూరి పరమేశ్వరి, లావేటి సన్యాసిరావు, తలారి సుబ్బరాజు, జగతా కుమారస్వామి, ఎక్స్ అఫిషియో సభ్యునిగా ఆలయన ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.వెంకటాద్రి, మాజీ చైర్మన్ దగ్గుపల్లి సాయిబాబా, తూములూరి వీరభద్రరావు, రామాల శ్రీను, పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఆరిలోవ ఎస్ఐ

... 5వ పేజీ తరువాయి

మొత్తంతోపాటు కారును కూడా వెనక్కి ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు. కేసు సెటిల్ చేసినందుకు తనకు రూ.30 వేలు ఇవ్వాలని కారును కొనుగోలు చేసిన విజయనగరం జిల్లా బొండపల్లికి చెందిన వ్యక్తిని ఎస్ఐ హరికృష్ణ డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బుల్లేవని, ఇప్పటికే అప్పుల పాలైపోయానని బాధితుడు చెప్పారు. దీంతో కేసు కట్టకుండానే వివాదాన్ని సెటిల్ చేశానని, కనీసం రూ.పది వేలు అయినా ఇవ్వాల్సిందేనని ఎస్ఐ హరికృష్ణ స్పష్టంచేశారు. ఆ మొత్తం కూడా లేదని బాధితుడు చెప్పడంతో అతడితో పాటు స్టేషన్‌కు వెళ్లిన అతని స్నేహితుడు శ్రీకాంత్ వద్ద సెల్‌ఫోన్ లాక్కొని, రూ.30 వేలు ఇచ్చిన తర్వాత సెల్‌ఫోన్ పట్టుకువెళ్లాలని చెప్పారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు 1440 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏసీబీ అధికారులు పథకం ప్రకారం గురువారం బాధితుడికి రూ.పది వేలు ఇచ్చి స్టేషన్‌కు పంపించారు. ఆ మొత్తాన్ని ఎస్ఐ హరికృష్ణ స్వయంగా తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

ఇదిలావుండగా లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఎస్ఐ హరికృష్ణ మొదటి నుంచి వివాదాస్పదుడేనని పోలీస్ వర్గాలు పేర్కొంటున్నాయి. 2012 బ్యాచ్‌కు చెందిన హరికృష్ణ నగరంలో స్పెషల్‌బ్రాంచిలో కొన్నాళ్లు పనిచేసి, రాజకీయంగా తనకున్న పలుకుబడిని ఉపయోగించి సొంత జిల్లా అయిన శ్రీకాకుళానికి బదిలీ చేయించుకున్నారు. కొన్నాళ్ల కిందట టెక్కలిలో పనిచేస్తుండగా వైసీపీ నేత పుట్టినరోజు వేడుకల సందర్భంగా వేదికపైకి ఎక్కి, మహిళలతో కలిసి డ్యాన్స్ చేసినట్టు సమాచారం. దీనిపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తడంతో అధికారులు వీఆర్‌కు సరండర్ చేశారు. అయితే తన రాజకీయ పలుకుబడితో తిరిగి పోస్టింగ్ సంపాదించుకున్నాడని చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు నేపథ్యంలో కొద్ది రోజుల కిందట నగరానికి బదిలీపై వచ్చిన హరికృష్ణ లంచం కోసం డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడ్డారు.

గర్భిణుల అవస్థలు

... 5వ పేజీ తరువాయి

వెళ్లిన ఆంధ్రజ్యోతి ప్రతినిధి.. గైనిక్ ఓపీ వద్ద పెద్ద సంఖ్యలో గర్భిణులు వేచివుండడాన్ని గమనించి డాక్టర్ గురించి వాకబు చేయగా ఎవరూ లేరని చెప్పారు. దీంతో సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణిని కలవగా డాక్టర్ లక్ష్మణరావు సెలవులో వున్నట్టు చెప్పారు. వైద్య పరీక్షల కోసం ఓపీ వద్ద పెద్ద సంఖ్యలో గర్భిణులు వేచి వున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఇతర వైద్యులకు ఫోన్ చేసి ఓపీ చూడాలని చెప్పారు. అప్పటి సమయం సుమారు 11.20 గంటలు అయ్యింది. వైద్యుల్లో ఎవరు సెలవు పెట్టారు, ఎవరు విధులకు హాజరవుతున్నారు అన్నదానిపై పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడినట్టు అర్థం అవుతున్నది.

రాష్ట్రస్థాయిలో అత్యధిక కాన్పులు చేస్తున్న వైద్యశాలగా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి గతంలో పేరుండేది. అటువంటిది గైనికాలజిస్టుల నిర్లక్ష్యం, సమయ పాలన పాటించక పోవడంతో రానురాను సేవలు సన్నగిల్లుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పలువురు వైద్యులు ఉదయం తొమ్మిది గంటలకు ఆస్పత్రికి వచ్చి, బయోమెట్రిక్‌లో హాజరు నమోదు చేసుకుని బయటకు వెళ్లిపోతున్నారని, ప్రైవేటు ఆస్పత్రులు/ క్లినిక్‌లో పనులు చూసుకుని తీరిగ్గా 11 గంటలకు వస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో అధిక ఫీజులు, వైద్యఖర్చులు భరించలేదని పేద, మధ్య తరగతి ప్రజలు వైద్య సేవల కోసం ప్రాంతీయ ఆస్పత్రికి వస్తుంటారు. కానీ ఇక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఎలమంచిలి సీటుపై పునరాలోచించాలి

▸▸ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, మార్చి 14: టీడీపీ కార్యకర్తల మనోభావాల మేరకు ఎలమంచిలి టికెట్‌పై చంద్రబాబునాయుడు పునరాలోచించాలని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొత్తులో భాగంగా సర్వేలు జరిపి గెలిచే అభ్యర్థికి సీటిస్తే అంతా సహకరిస్తారన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలో టీడీపీ చాలా బలంగా ఉందని, జనసేనకు సీటు కేటాయించడంపై కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. శుక్రవారం అచ్యుతాపురంలో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశామని. కార్యకర్తలు, నాయకులు మనోభావాలకు అనుకూలంగా తాను నిర్ణయం తీసుకుంటానన్నారు. ఈ సమావేశంలో నాయకులు ధర్మిరెడ్డి నాయుడు బాబు, జనపరెడ్డి నరసింగరావు, ధూలి రంగనాయకులు, మేరుగు బాపునాయుడు పాల్గొన్నారు.

పప్పలను మర్యాదపూర్వకంగా కలిసిన సుందరపు



పప్పల చలపతిరావును సత్కరించిన విజయకుమార్

రాంబిల్లి, మార్చి 14 : జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సుందరపు విజయకుమార్, జనసేన నాయకులు గురువారం మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నేత పప్పల చలపతిరావును దిమిలిలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఉమ్మడి అభ్యర్థిగా టికెట్ ఇచ్చారని, తన గెలుపునకు సహకరించాలని విజయకుమార్ అభ్యర్థించారు. దీనిపై స్పందించిన చలపతిరావు అధిష్ఠానం ఆదేశాల మేరకు విజయం కోసం కృషి చేస్తానని భరోసా ఇచ్చారని సుందరపు తెలిపారు. ఈ సందర్భంగా చలపతిరావును విజయకుమార్ సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి రామదాసు, పప్పల నూకన్నదొర,పలువురు జనసేన నాయకులు ఉన్నారు.

నూకాంబిక కొత్త అమావాస్య జాతరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి : మంత్రి

అనకాపల్లి టౌన్, మార్చి 14 : నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరలో భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. గురువారం మంత్రి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రూ. కోటి 60 లక్షలతో నిర్మించే క్యూ కాంప్లెక్స్, మండపానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతుం ఆయన మాట్లాడుతూ వచ్చే నెల ఏడు, ఎనిమిది తేదీల్లో జరిగే జాతరకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, పాలకమండలి సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు

సబ్బవరం, మార్చి 14 : వేరుశనగ, నువ్వు పంటలకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకలు ఎం. రామారావు సూచించారు. గురువారం మలునాయుడు పాలెంలో వేరుశనగ, నువ్వు పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ..వేరుశనగ పూత దశలో ఉన్నప్పుడు జిప్సం వేసుకుంటే గింజలు బరువుగా రావడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏవో పోతల సత్యనారాయణ, సర్పంచ్ బోను దేముడమ్మ, ఎంపీటీసీ సభ్యుడు గొర్లి కనకరాజు, రైతులు బోను గంగునాయుడు, ఏఈవో బాలరాజు, వీఏఏ హేమలత తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పరవాడ, మార్చి 14: పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని సబ్బవరం సీడీపీవో వి.లలిత కుమారి అన్నారు. వాడచీపురుపల్లి పంచాయతీ పరిధిలోని పందివానిపాలెం, దలాయిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా రక్తహీనతను అరికట్టవచ్చనన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు వి.నీలిమ, పి.కనకలక్ష్మి, ఎం.రాజేశ్వరి, పి.వరలక్ష్మి పాల్గొన్నారు.

పీఆర్‌బీపురం హైస్కూల్ సందర్శన

పాయకరావుపేట రూరల్, మార్చి14: పాఠశాలల తనిఖీలో భాగంగా గురువారం పెదరాంభద్రపురం జడ్పీ హైస్కూల్‌ను సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు మేఘ మేనాన్ సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాపరమైన కార్యక్రమాలు, మౌలికవసతులు, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. పాఠశాలను అందంగా నిర్వహించడం పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మానవెల్లి అప్పారావు, రిసోర్స్‌పర్సన్ దొర, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

పాయకరావుపేట రూరల్, మార్చి14: మండలంలోని పీఎల్‌పురం, ఎస్.నర్సాపురాల్లో అభివృద్ధిలను గురువారం ప్రారంభించారు. పీఎల్.పురంలో సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే కంబాల జోగులు ఎస్.నర్సాపురంలోని రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీటీసీ సభ్యుడు లంక సూర్యనారాయణ, సర్పంచ్ పడాల సోమన్నదొర పాల్గొన్నారు.

చేయూత, ఆసరా చెక్కుల పంపిణీ

పాయకరావుపేట, మార్చి 14: స్థానిక మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం చేయూత, ఆసరా చెక్కులను ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి లబ్ధిదారులు పంపిణీ చేశారు. అదేవిధంగా రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన ఎమ్మెల్యే గొల్ల బాబూరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, మాజీ ఎమ్మెల్సీ డీవీ.సూర్యనారాయణరాజు, జడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి బాబి పాల్గొన్నారు.

ఘనంగా నల్లమారెమ్మ జాతర

అచ్యుతాపురం, మార్చి 14: మండలంలోని గొర్లె ధర్మవరంలో నల్లమారెమ్మ జాతర గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ, పులిహోరను నిర్వాహకులు పంపిణీ చేశారు. గురువారం రాత్రికి భారీ స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. బాణసంచాను కాల్చారు. ఈ కార్యక్రమంలో గొర్లె నూకరాజు, రామజోగి, రమణ, నానేపల్లి సత్తిబాబు, గెంజి రాంబాబు, బాబూరావు పాల్గొన్నారు.

మినీ కల్యాణ మండపానికి శంకుస్థాపన

సబ్బవరం, మార్చి14: సబ్బవరం శివారు చిన్నయ్యపాలెంలో జాతీయ రహదారుల సంస్థ కేటాయించిన నిధులు రూ.24 లక్షలతో నిర్మించనున్న మినీ కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే కల్యాణ మండపం పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు బోకం రామునాయుడు, ఉమామహేశ్వరరావు, ఎస్.ముత్యాల నాయుడు, కొటాన రాము, యడ్ల నాయుడు పాల్గొన్నారు.

పశువుల పాక దగ్ధం

కొత్తూరు, మార్చి 14: అనకాపల్లి మండలం వేటజంగాల పాలెంలో జరిగిన అగ్నిప్రమాదంలో తేలాపు చంద్రరావుకు చెందిన పశువుల పాక, గడ్డికుప్ప దగ్ధమయ్యాయి. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ కాల్చి పడేయడంతో ఈ అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. విషయాన్ని తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్తగా త్రినాథ్



నియామక పత్రం అందుకుంటున్న త్రినాథ్

నాతవరం, మార్చి 14 : బీజేపీ నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్తగా నాతవరం మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన గవిరెడ్డి త్రినాథ్ నియామకమయ్యారు. ఈ మేరకు పార్టీ అనకాపల్లి పార్లమెంట్ కన్వీనర్ బీవీఎస్ వర్మ చేతుల మీదుగా గురువారం నియామక పత్రం అందుకున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు త్రినాథ్‌ను నియమించినట్టు ఆయన చెప్పారు. గతంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఇతనికి ఉంది.

గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

గొలుగొండ, మార్చి 14 : మండలంలో గురువారం రెండు గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఎంపీపీ గజ్జలపు మణికుమారి శంకుస్థాపన చేశారు. కొత్తఎల్లవరం శివారు కరక రోడ్డు నుంచి డొంకాడకు కిలో మీటరున్నర బీటీ రోడ్డు, పప్పుశెట్టిపాలెం పంచాయతీ కంఠారం నుంచి పప్పుశెట్టిపాలెం పాత జంక్షన్ వరకు రోడ్డు నిర్మాణానికి ఆమె శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుర్ల వెంకటగిరిబాబు, ఎస్సీ సెల్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత, నాయకులు లెక్కల సత్యనారాయణ, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ గణిత దినోత్సవం

మాకవరపాలెం, మార్చి 14 : తూటిపాలలో అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పై సింబల్‌ను తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము మాట్లాడుతూ నిత్య జీవితంలో గణితంతో అన్నీ ముడిపడి ఉన్నాయన్నారు. లెక్కలు బాగా నేర్చుకున్న విద్యార్థులకు భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

▸▸ సెక్టార్ అధికారుల సమీక్షా సమావేశంలో ఆర్డీవో జయరాం ▸▸ ఈవీఎంలు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ పాయింట్ల తదితరాలపై సూచనలు

నర్సీపట్నం, మార్చి 14 : ఎన్నికల నిర్వహణపై సెక్టార్ అధికారులతో ఆర్డీవో హెచ్‌వీ జయరాం గురువారం ఇక్కడ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించారు. ప్రధానంగా ఈవీఎంలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ పాయింట్లు వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయంతో పని చేసి ఎటువంటి ఆటంకం లేకుండా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు.



ఎన్నికల విధులపై సెక్టార్ అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీవో జయరాం

'కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం'

నర్సీపట్నం అర్బన్, మార్చి 14 : వైసీపీ పాలనలో అన్నిరంగాల్లో నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలన్నదే జనసేన అధినేత పవన్ కల్యాణ్ లక్ష్యమని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని తొమ్మిదో వార్డులో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ త్వరలో జరగనున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అద్దేపల్లి గణేష్, నాయకులు గండెం దొరబాబు, కోన నారాయణరావు, సూరిశెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా చూడాలి'

నాతవరం, మార్చి 14 : వల్సంపేటలో గల సర్వే నెంబరు 180లో 32 సెంట్లు స్థలాన్ని ఎవరూ ఆక్రమించుకోకుండా రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వైసీపీ నాయకుడు, సర్పంచ్ ఇటంశెట్టి శ్యామల భర్త శ్రీనివాస్ కోరారు. గురువారం సాయంత్రం ఇక్కడ సర్పంచ్ శ్యామల, వైసీపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పదిహేను రోజుల క్రితం వల్సంపేటలో ఫెన్సింగ్ వేసి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకునే విషయంలో తనకు, మాజీ సర్పంచ్ సుర్ల యోగి వర్గీయులకు గొడవ జరగ్గా పోలీసులు, రెవెన్యూ అధికారులు వచ్చి తాత్కాలికంగా పరిష్కరించారన్నారు. అయితే ఎట్టకేలకు గురువారం తహసీల్దార్ రవికుమార్ సదరు స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.

చోరీ జరిగిన సెల్ ఫోన్లు రికవరీ

▸▸ బాధితులకు అప్పగించిన సీఐ

నర్సీపట్నం, మార్చి 14 : చోరీకి గురైన ఏడు సెల్ ఫోన్లను పట్టణ పోలీసులు రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఇటీవల పట్టణంలో సెల్ ఫోన్లు దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న విషయం తెలిసిందే. సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో క్రైమ్ టీమ్ సహాయంతో సెల్ ఫోన్ చోరీ చేసిన నిందితులను గుర్తించారు. వారి నుంచి చోరీ సొత్తు రికవరీ చేశారు. ఈ మేరకు పట్టణ సీఐ కాంతి కుమార్ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు.

ఏసీబీకి చిక్కిన ఆరిలోవ ఎస్ఐ

... 5వ పేజీ తరువాయి

మొత్తంతోపాటు కారును కూడా వెనక్కి ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు. కేసు సెటిల్ చేసినందుకు తనకు రూ.30 వేలు ఇవ్వాలని కారును కొనుగోలు చేసిన విజయనగరం జిల్లా బొండపల్లికి చెందిన వ్యక్తిని ఎస్ఐ హరికృష్ణ డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బుల్లేవని, ఇప్పటికే అప్పుల పాలైపోయానని బాధితుడు చెప్పారు. దీంతో కేసు కట్టకుండానే వివాదాన్ని సెటిల్ చేశానని, కనీసం రూ.పది వేలు అయినా ఇవ్వాల్సిందేనని ఎస్ఐ హరికృష్ణ స్పష్టంచేశారు. ఆ మొత్తం కూడా లేదని బాధితుడు చెప్పడంతో అతడితోపాటు స్టేషన్‌కు వెళ్లిన అతని స్నేహితుడు శ్రీకాంత్ వద్ద సెల్ ఫోన్ లాక్కొని, రూ.30 వేలు ఇచ్చిన తర్వాత సెల్‌ఫోన్ పట్టుకువెళ్లాలని చెప్పారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు 1440 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏసీబీ అధికారులు పథకం ప్రకారం గురువారం బాధితుడికి రూ.పది వేలు ఇచ్చి స్టేషన్‌కు పంపించారు. ఆ మొత్తాన్ని ఎస్ఐ హరికృష్ణ స్వయంగా తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

ఇదిలావుండగా లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఎస్ఐ హరికృష్ణ మొదటి నుంచి వివాదాస్పదుడేనని పోలీస్ వర్గాలు పేర్కొంటున్నాయి. 2012 బ్యాచ్‌కు చెందిన హరికృష్ణ నగరంలో స్పెషల్‌బ్రాంచిలో కొన్నాళ్లు పనిచేసి, రాజకీయంగా తనకున్న పలుకుబడిని ఉపయోగించి సొంత జిల్లా అయిన శ్రీకాకుళానికి బదిలీ చేయించుకున్నారు. కొన్నాళ్ల కిందట టెక్కలిలో పనిచేస్తుండగా వైసీపీ నేత పుట్టినరోజు వేడుకల సందర్భంగా వేదికపైకి ఎక్కి మహిళలతో కలిసి డ్యాన్స్ చేసినట్టు సమాచారం. దీనిపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తడంతో అధికారులు వీఆర్‌కు సరండర్ చేశారు. అయితే తన రాజకీయ పలుకుబడితో తిరిగి పోస్టింగ్ సంపాదించుకున్నాడని చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు నేపథ్యంలో కొద్దిరోజుల కిందట నగరానికి బదిలీపై వచ్చిన హరికృష్ణ లంచం కోసం డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడ్డారు.

గర్భిణుల అవస్థలు

... 5వ పేజీ తరువాయి

వెళ్లిన ఆంధ్రజ్యోతి ప్రతినిధి.. గైనిక్ ఓపీ వద్ద పెద్ద సంఖ్యలో గర్భిణులు వేచివుండడాన్ని గమనించి డాక్టర్ గురించి వాకబు చేయగా ఎవరూ లేరని చెప్పారు. దీంతో సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణిని కలవగా డాక్టర్ లక్ష్మణరావు సెలవులో వున్నట్టు చెప్పారు. వైద్య పరీక్షల కోసం ఓపీ వద్ద పెద్ద సంఖ్యలో గర్భిణులు వేచి వున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఇతర వైద్యులకు ఫోన్ చేసి ఓపీ చూడాలని చెప్పారు. అప్పటి సమయం సుమారు 11.20 గంటలు అయ్యింది. వైద్యుల్లో ఎవరు సెలవు పెట్టారు, ఎవరు విధులకు హాజరవుతున్నారు అన్నదానిపై పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడినట్టు అర్థం అవుతున్నది.

రాష్ట్రస్థాయిలో అత్యధిక కాన్పులు చేస్తున్న వైద్యశాలగా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి గతంలో పేరుండేది. అటువంటిది గైనికాలజిస్టుల నిర్లక్ష్యం, సమయ పాలన పాటించకపోవడంతో రానురాను సేవలు సన్నగిల్లుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పలువురు వైద్యులు ఉదయం తొమ్మిది గంటలకు ఆస్పత్రికి వచ్చి, బయోమెట్రిక్‌లో హాజరు నమోదు చేసుకుని బయటకు వెళ్లిపోతున్నారని, ప్రైవేటు ఆస్పత్రులు/ క్లినిక్‌లో పనులు చూసుకుని తీరిగ్గా 11 గంటలకు వస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో అధిక ఫీజులు, వైద్యఖర్చులు భరించలేదని పేద, మధ్య తరగతి ప్రజలు వైద్య సేవల కోసం ప్రాంతీయ ఆస్పత్రికి వస్తుంటారు. కానీ ఇక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

వైద్యులు సమయపాలన పాటించేలా చూస్తాం



గతంలో కంటే ప్రసూతి వైద్య సేవలు మెరుపడ్డాయి. నలుగురు డాక్టర్లు ఉన్నారు. ఇద్దరు మత్తు డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారు. ఓపీలోనే స్కానింగ్, దాని పక్కనే రక్తలు పరీక్షలు చేయిస్తున్నాము. డాక్టర్లు సమయ పాలన పాటించేలా చర్యలు చేపడతాం.

డాక్టర్ నీలవేణిదేవి, సూపరింటెండెంట్, ప్రాంతీయ ఆస్పత్రి, నర్సీపట్నం

నాతవరంలో గడ్డి ట్రాక్టర్ దగ్ధం

నాతవరం, మార్చి 14 : మండల కేంద్రం నాతవరంలో గురువారం సాయంత్రం గడ్డి లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో గడ్డి పూర్తిగా దగ్ధమైంది. రైతు ముప్వల చినబాబుకు చెందిన వరి గడ్డిని ట్రాక్టర్‌పై వేసుకుని పాక దగ్గరకు తీసుకు వెళుతుండగా, నల్లగొండమ్మతల్లి ఆలయం సమీపంలో వేలాడుతున్న విద్యుత్‌వైర్లు తగలి మంటలు చెలరేగాయి.

రైతాంగ సమస్యలపై వామపక్షాల నిరసన

నర్సీపట్నం, మార్చి 14 : రైతాంగం చేపట్టిన 'చలో ఢిల్లీ' ఆందోళనకు మద్దతుగా సీపీఎం, సీపీఐ నాయకులు ఇక్కడి ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. 2021లో రైతాంగానికి మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని రెండో దఫా ఉద్యమం చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని విమర్శించారు. నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, అడిగర్ల రాజు, జి.గురుబాబు, ఎల్.గౌరీ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం
నియోజకవర్గం

'వివాదాస్పద స్థలంలో కంచె యథాతథం'

చోడవరం, మార్చి14: పట్టణంలోని పంచాయతీకి, ఆర్టీసీకి మధ్య తలెత్తిన వివాదం నేపథ్యంలో ఆ స్థలంలో వేసిన కంచె కొనసాగించాలని నిర్ణయించినట్టు పంచాయతీ ఈవో నారాయణరావు తెలిపారు. ఆర్టీసీ స్థలంలో పంచాయతీకి హక్కు ఉన్నందున కంచె వేశామని, అయితే ఈ కంచె స్థలం చుట్టూ వేయాలని నిర్ణయించి, ఆ స్థలంలో బోర్డు ఏర్పాటు చేయాలని భావించామన్నారు. అయితే ఈ చర్యను కొందరు పంచాయతీ వార్డు సభ్యులు అపార్థం చేసుకుని అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో గురువారం వారికి పూర్తి విషయాన్ని వెల్లడించామన్నారు. దీనిపై పంచాయతీ సభ్యులు వ్యవహారం కోర్టులో ఉన్నందున ఇది తేలేంత వరకూ పంచాయతీ వేసిన కంచెను అలాగే కొనసాగించాలని కోరారన్నారు.

గుడ్డిపలో రామాలయ నిర్మాణానికి భూమి పూజ

రావికమతం,మార్చి14: మండలంలో గుడ్డిపలో రామాలయ నిర్మాణానికి సర్పంచ్ గుమ్మాల గణేశ్వరావు ఆధ్వర్యంలో గ్రామస్థులు గురువారం భూమి పూజ చేశారు. టీటీడీ రూ.10లక్షలు మంజూరు చేయగా.. గ్రామస్థులు విరాళాలతో రామాలయాన్ని నిర్మిస్తున్నారు. పురోహితులు బ్రహ్మశ్రీ బోడశకుర్తి రాంబాబుశర్మ శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలి

రోలుగుంట, మార్చి 14 : ప్రకృతి వ్యవసాయ పద్ధతులను సకాలంలో పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను సాగు చేయవచ్చునని సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కొవ్వూరులో రైతులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణలో సీనియర్ శాస్త్రవేత్త డా.శైలజ కుర్రా, అభ్యుదయ రైతులు, బంటు రాజు, సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ, వై.రాజారావు పాల్గొన్నారు.

కొత్తకోటలో నిలిచిన కొళాయిల నీటి సరఫరా

రావికమతం, మార్చి 14: మేజరు పంచాయతీ కొత్తకోటలో గురువారం కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో మంచి నీటి సరఫరా విభాగంలో పనిచేసే సిబ్బంది నలుగురు ఒకేసారి విధులను బహిష్కరించారు. దీంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. తప్పసరి పరిస్థితుల్లో విధులు బహిష్కరించామని నీటి సరఫరా ఉద్యోగి గంట్రెడ్డి ధర్మరాజు తెలిపారు. దీనిపై సర్పంచ్ కోన లోవరాజును వివరణ కోరగా.. సాంకేతిక సమస్య కారణంగా సిబ్బందికి జీతాలు సమస్య తలెత్తిందన్నారు. శనివారం నాటికి ఈ సమస్య తీరిపోతుందన్నారు.సిబ్బందిని విధులలోకి చేరాలని చెప్పామన్నారు. శుక్రవారం కొళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

రోలుగుంట, మార్చి 14 : మండలంలోని అడ్డసరం గ్రామ రెవెన్యూ దిబ్బలపాలెంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన బర్ల శ్రీనుపై చర్యలు తీసుకోవాలని స్థానికులు వేపాడ ధర్మపణి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆక్రమించిన స్థలంలో పాక వేసుకున్నారని, పలు మార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించ లేదని పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామ వీఆర్వో లక్ష్మణ్ వద్ద విలేకరులు ప్రస్తావించగా.. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన విషయం వాస్తవమేనన్నారు. ఇప్పటికే కబ్జాదారుడికి నోటీసులు పంపించామని, చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడి దృష్టికి లోసింగి గ్రామ సమస్యలు

రోలుగుంట, మార్చి 14 : తమ సమస్యలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ దృష్టికి లోసింగి గ్రామస్థులు తీసుకెళ్లారు. గురువారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ లోసింగి, అర్ల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు కె.గోవిందరావు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ గ్రామానికి వచ్చినప్పుడు పక్కా రహదారి సౌకర్యం కల్పిస్తామని, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా నేటికీ అమలు కాలేదని విన్నవించారు. అలాగే చాలా మందికి పిల్లలకు నేటికీ ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు లేవన్నారు. అంగన్‌వాడీ సరుకులు కావాలంటే మూడు నాలుగు కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. వైద్య సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, డోలిమోత ద్వారా ఆసుపత్రికి తీసుకువెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని విన్నవించారు.

మోదకొండమ్మను దర్శించుకున్న 'పైలా'

మాడుగుల, మార్చి 14 : వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా అందరినీ కలుపుకుని పోతానని టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. టీడీపీ అధిష్ఠానం టికెట్ ఖరారు చేసిన అనంతరం మాడుగుల మోదకొండమ్మను ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజుతోపాటు కమిటీ సభ్యులు అమ్మవారి మెమోంటో ఇచ్చి సత్కరించారు. అనంతరం పైలా ప్రసాదరావు మాట్లాడుతూ టీడీపీలో వర్గ విభేదాలకు తావు లేకుండా అందరితో మమేకమై పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మోదకొండమ్మను దర్శించుకుంటున్న పైలా

చోడవరంలో టీడీపీ జెండా ఎగరేద్దాం : రాజు

చోడవరం, మార్చి 14: కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేద్దామని టీడీపీ-జనసేన- బీజేపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు పిలుపునిచ్చారు. గురువారం అధిష్ఠానం టిక్కెట్ ఖరారు చేసిన అనంతరం తనను కలవడానికి వచ్చిన అభిమానులు, పార్టీ కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేయాల న్నారు. ఈ సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు బొడ్డేడ గంగాధర్, దేవరపల్లి వెంకటఅప్పారావు, ఎస్సీ సెల్ నాయకులు ఎలకా మల్లిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కొట్నాపు చిన్న తదితరులు పాల్గొన్నారు.



టికెట్ ఖరారుతో రాజును ఎత్తుకున్న నేతలు, కార్యకర్తలు

రాజును కలిసిన టీడీపీ నేతలు

టీడీపీ టికెట్ దక్కించుకున్న మాజీ ఎమ్మెల్యే రాజును గురువారం రాత్రి టీడీపీ నేతలు మజ్జి గౌరీ శంకర్‌తోపాటు, బొడ్డేడ గంగాధర్, గోవాడ షుగర్స్ కార్మిక సంఘం నాయకుడు శరగడం రామునాయుడు కలిసి శుభాకాంక్షలు అందజేశారు.

రావికమతంలో.. చోడవరం ఎమ్మెల్యే టికెట్ మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు కేటాయించడంపై టీడీపీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం టికెట్ ప్రకటించిన తర్వాత టీడీపీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే రాజు వద్దకు వెళ్లి అభినందనలు తెలిపారు.

టికెట్‌పై అధిష్ఠానం పునరాలోచన చేయాలి : పీవీజీ కుమార్

కె.కోటపాడు, మార్చి 14 : మాడుగుల టీడీపీ టికెట్ విషయంలో పునఃపరిశీలన చేయాలని టీడీపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ అన్నారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్‌చార్జిలకే అసెంబ్లీ ఎన్నికల టికెట్లు అని ప్రకటించి, ఇప్పుడు వేరొకరికి ఇవ్వడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ కంటతడి పెట్టారు. పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో అన్ని కార్యక్రమాలను విజయవంతం చేసి పార్టీను ఒక గాడిలో పెట్టానన్నారు. వర్గపోరు లేకుండా అందరినీ కలుపుకుని పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేశానన్నారు. సమావేశంలో సబ్బవరపు రామునాయుడు, లెక్కల అవతారం, లెక్కల మల్లేశ్వరరావు, బత్తి రమణ, జూరెడ్డి రాము, కసిరెడ్డి అప్పలనాయుడు, కన్నూరి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పునరాలోచన చేయాలి : గవిరెడ్డి

చీడికాడ, మార్చి 14: మాడుగుల టీడీపీ టికెట్‌పై టీడీపీ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రబాబునాయుడు, లోకేశ్‌లు పునరాలోచన చేయాలని మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు కోరారు. మాడుగుల టీడీపీ టికెట్ పైలా ప్రసాదరావుకు కేటాయించిన అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం రాత్రి అప్పలరాజుపురం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధికారంలో లేకపోయినా వైసీపీతో పోరాడామన్నారు. కనీసం గ్రామ కమిటీ అధ్యక్ష పదవిని కూడా చేపట్టని పైలా ప్రసాదరావుకి టికెట్ ఇవ్వడంపై నియోజకవర్గంలోని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారన్నారు. అభ్యర్థి విషయంలో పునరాలోచన చేయకపోతే నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానన్నారు. ఈ సమావేశంలో చీడికాడ, దేవరాపల్లి టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతల చిన్నంనాయుడు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, చెరకాన సూర్యనారాయణ, బొబ్బాది తాతారావు, పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

చోడవరం, మార్చి 14: జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లం రామప్పారావు, సిరిపురపు రమేష్, గూనూరు మూలినాయుడు, కర్రి రమేష్ నరవ సరోజ, తదితరులు పాల్గొన్నారు. గౌరీపట్నంలో జనసేన నాయకుడు ఆకుల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో మాజీ ఎమ్మెల్యే రాజు, మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, జనసేన సీనియర్ నాయకులు జెర్రిపోతుల రమణాజీ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్‌లో.. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ నాయకులు ముర్రు ఈశ్వరరావు, కృష్ణ ఆధ్వర్యంలో ఘాట్‌రోడ్డు జంక్షన్‌లోని పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం బైక్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శివాజీ, అచ్యుతరావు, మహేశ్, పాల్గొన్నారు.

కె.కోటపాడులో.. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాడుగుల నుంచి చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు బాలిబోయిన సంతోష్‌కుమార్, మాడుగుల జనసేన ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ, నాయకులు గనిరెడ్డి శివాజీ, గొర్రుపోతు రామ్మూర్తి నాయుడు, గుమ్మడి శ్రీరామ్ పాల్గొన్నారు.

మాడుగులలో.. మాడుగుల బస్టాండ్ ఆవరణలో జనసేన నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రొబ్బా మహేష్, ఇళ్లపు రమేష్, గుమ్మడి శ్రీరాం, జి. శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల
నియోజకవర్గం

కోనాం సంతలో చింతపండుకి గిరాకీ

చీడికాడ, మార్చి 14: మండలంలో కోనాం సంతకు వచ్చిన చింతపండుకు గురువారం మంచి ధర పలికింది. దీంతో గిరిరైతులు ఆనందం వ్యక్తంచేశారు. మాడుగుల, పాడేరు, అనంతగిరి, హుకుంపేట మండలాల్లో గిరిజన గ్రామాల నుంచి గురువారం ఉదయం 6గంటలకే చింతపండు వచ్చింది. మైదాన ప్రాంత వ్యాపారులు సంతకు వచ్చిన చింతపండును విక్రయాలు చేశారు. గతవారం కిలో రూ.45లు ధర పలకగా.. రూ.55 నుంచి రూ.60 పలికింది. ఈ వారం 35 నుంచి 40కిలోల కావిడి రూ. రెండు వేలు నుంచి రూ.2,500 వరకూ ధర పలికింది.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి తీర్థం



అమ్మవారికి కొబ్బరికాయ కొడుతున్న బూడి

మాడుగుల, మార్చి 14 : మాడుగుల శివారు ఖండివరం వెళ్లే దారి పొలాల్లో గల మరిడిమాంబ అమ్మవారి తీర్థాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు, అర్చనలు చేశారు. అలాగే మరికొంతమంది అమ్మవారికి ఘటాలను సమర్పించుకున్నారు. అలాగే మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అనంతరం ఎడ్ల పరుగు పందెం పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అమ్మవారిని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు.

'పైలా ప్రసాదరావుని గెలిపిస్తాం'

చీడికాడ, మార్చి 14: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు తెలిపారు. మాడుగుల టీడీపీ టికెట్ పైలా ప్రసాదరావుకు ప్రకటించడంతో పార్టీ సీనియర్ నాయకులు రెడ్డి రాము, పాలకుర్తి పరమేశ్వరరావులతో కలిసి పైలా ప్రసాదరావుని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ, పైలా ప్రసాదరావుని నియమించడం ఆనందంగా ఉందన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి మాడుగుల కోటపై టీడీపీ జెండా ఎగురవేస్తామన్నారు.

దొడ్డి దారిన టీచర్ల బదిలీ

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖ వింత పోకడలు పోతోంది. ఈ ఏడాది జూన్ నెలాఖరుకు ఖాళీ కానున్న పోస్టుల్లో ఇప్పుడే పలువురిని నియమిస్తూ ఆదేశాలు ఇస్తున్నది. నిబంధనలకు విరుద్ధంగా అంటే దొడ్డిదారిన ఉమ్మడి జిల్లాలో సుమారు 90 టీచర్లను తాము పనిచేసే పాఠశాలల నుంచి కోరుకున్న చోటకు బదిలీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు గురువారం జిల్లా విద్యాశాఖకు అందాయని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యవహారంలో సుమారు రూ.3.5 కోట్లు వరకూ చేతులు మారాయని, అధికార పార్టీ కీలక నేత పీఏ సూత్రధారిగా వ్యవహరించారని సమాచారం. ఏజెన్సీలో పనిచేస్తున్న సుమారు 70 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు విశాఖ నగరం, పరిసరాలు, మైదాన ప్రాంతంలో స్కూళ్లలో పోస్టింగ్ తెచ్చుకున్నారు. అయితే ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం ఖాళీలు లేవు. రానున్న రెండు, మూడు నెలల్లో పలువురు టీచర్లు పదవీ విరమణ చేయనున్నారు. అప్పటివరకూ ఆయా ఉపాధ్యాయులు (ప్రస్తుతం బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్నవారు) ప్రస్తుతం పనిచేసే పాఠశాలల్లోనే పనిచేస్తారు. ఈ మేరకు విశాఖ జిల్లా శాఖాధికారి కార్యాలయానికి ఉత్తర్వులు వచ్చినా గోప్యంగా ఉంచుతోంది.